www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

ఉలవలతో ఇన్ని లాభాలా..?



7.



జెన్‌జీపై కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు..

8.

గురువారం, 30-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :89 Issue : 89 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



2.

## హైడ్రాపై కేటీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే మాట్లాడుతున్నారు: తుమ్మల

హైడ్రాపై బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి తుమ్మల కౌంటర్

బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను అందులో వేస్తామంటున్నారు' అంటూ ఎద్దేవా

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడి

ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న మంత్రి

గాంధీభవన్ ప్రజలకు సమస్యల పరిష్కార వేదికగా మారిందని వ్యాఖ్య



## తెలంగాణ భూముల లెక్కల్లో భారీ గందరగోళం..

ధరణి తర్వాత భూముల రికార్డుల్లో అక్రమాలా?.. బయటపడుతున్న సంచలన అంశాలు

ప్రభుత్వ భూములకు ఏమైంది?.. ధరణి రికార్డులపై పెరుగుతున్న అనుమానాలు

భూముల లెక్కలు తేల్చే దిశగా ప్రభుత్వం.. ధరణి వ్యవహారంపై దృష్టి

తెలంగాణ భూముల గుట్టు విప్పనున్న ధరణి విచారణ

భూముల రికార్డుల్లో తేడాలు.. ధరణి అమలుపై ప్రశ్నల వర్షం

ప్రభుత్వ భూములపై ఎవరి కన్ను?.. ధరణి రికార్డులపై దర్యాప్తు

లక్షల కోట్ల ప్రభుత్వ భూములపై లెక్కల తేడా.. ధరణి కమిటీ దృష్టి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణలో భూమి అంటే కేవలం మట్టి కాదు. అది లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి. పేదల జీవనాధారం. పరిశ్రమలు, పాఠశాలలు, ఆస్పత్రులు, రహదారులు, గృహ నిర్మాణ పథకాలు, ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భవిష్యత్ సంపద. కానీ గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో భూముల లెక్కలు చూస్తే ఒకదానితో మరొకటి సరిపోలడం లేదు. ప్రభుత్వ రికార్డుల్లో ఒక విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో మరో విస్తీర్ణం, నిషేధిత జాబితాలో ఇంకో లెక్క కనిపిస్తోంది. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన తర్వాత రికార్డుల మార్పులు, నిషేధిత భూముల విడుదల, ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, నాలా మార్పిడులు, భూముల వర్గీకరణ మార్పులు, పేర్ల మార్పిడి, ఒకేరోజు వరుస లావాదేవీలు వంటి అనేక ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత

మిగతా 2లో..

తెలంగాణలో భూములు మాయమయ్యాయి. రికార్డులు ట్యాంపరింగ్ చేశారు. రాత్రికి రాత్రే మార్చేసుకున్నారు. ఇది ఇప్పటికే 3 కమిటీలు నిగ్గు తేల్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణి కమిటీ తేల్చి చెప్పింది. ఆ తర్వాత ఫోరెన్సిక్ ఆడిట్ స్పష్టం చేసింది. నిన్న మొన్నటి అధికారుల కమిటీ కూడా లెక్క తేల్చింది. గతంలోనే అక్రమాలు, అవినీతి, ఇల్లీగల్ ట్రాన్సాక్షన్స్, నాలా కన్వర్షన్లు, క్లాసిఫికేషన్ చేంజ్, పేరు మార్పిడి వంటి అనేక అంశాలు బయటికొచ్చాయి. ఇప్పుడు కొత్తగా వేసే స్పెషల్ ఎంక్వయిరీ కమిటీ(సెట్) ఏం చేస్తుందన్న ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే 3 నివేదికల మీద ఎలాంటి యాక్షన్ తీసుకున్నారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఇప్పుడు నాలుగో కమిటీ వేయడం విమర్శలకు తావిస్తోంది.



## తెలంగాణకు భారీ వర్ష హెచ్చరిక

ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షా లు

ఇవాళ, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం

ఆరు జిల్లాలకు ఆరెంజ్..

17 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణపై వాతావరణ శాఖ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం

2.

# ప్రమాదంలో సింగరేణి అస్తిత్వం

- మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలాన్ని తప్పుబట్టిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు
- సింగరేణికే నేరుగా బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్రానికి డిమాండ్
- టీఎస్ జెన్‌కోను వేలంలో దింపడం వెనుక కుట్ర ఉందని ఆరోపణ
- బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- సింగరేణి ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి
- వేలం ప్రక్రియ నుంచి టీఎస్ జెన్‌కోను తప్పించాలని డిమాండ్



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థ అస్తిత్వాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి చర్యలు ప్రమాదంలోకి నెడుతున్నాయని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్‌ను వేలం ద్వారా కేటాయించే ప్రక్రియను తప్పుబడుతూ, వేలం నిర్వహించే బదులు నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణికి నేరుగా బొగ్గు బ్లాకులు కేటాయించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా మణుగూరు పీకేవోసీపీ

మిగతా 2లో..

## ఆర్ఎస్ఎస్ వల్లే విద్యావ్యవస్థ నాశనం



**న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:**

లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీపేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. విద్యార్థుల ఆందోళనల అంశాన్ని ప్రస్తావిస్తూ ఆర్ఎస్ఎస్,

మిగతా 2లో..

### లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యాఖ్యల దుమారం

ఆ సంస్థకు చెందిన వాళ్లకే కీలక పదవులు: లోక్ సభలో రాహుల్ గాంధీ

అందుకే విద్యను ప్రైవేటుపరం చేస్తున్నారు

అమిత్ షా, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు

విద్యార్థుల ఆందోళనపై కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన విపక్ష నేత

ఆర్ఎస్ఎస్‌నే విద్యార్థులకు అసలైన శత్రువంటూ రాహుల్ వ్యాఖ్యలు

విద్యార్థులపై పోలీసుల చర్యలకు అమిత్ షా ఆదేశాలేనని ఆరోపణ

అభ్యంతరకర పదజాలంపై భాజపా సభ్యుల తీవ్ర నిరసన

## తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

ఢిల్లీలో కాంగ్రెస్ వరుస సమావేశాలు

మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌తో కీలక చర్చలు?

ఆగస్టు 15 తర్వాత విస్తరణకు సంకేతాలు

రెండు మంత్రి పదవుల భర్తీపై చర్చ

హైకమాండ్‌తో తెలంగాణ నేతల భేటీ

కడియం-కొండా వివాదంపై అసంతృప్తి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ వరుస సమావేశాలు నిర్వహించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పార్టీప్రభుత్వ సమన్వయం, అంతర్గత విభేదాలు వంటి కీలక అంశాలపై అధిష్ఠానం నేతలతో తెలంగాణ నాయకులు చర్చించినట్లు సమాచారం.

ఆగస్టు 15 తర్వాత తెలంగాణ మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను భర్తీ చేసేందుకు హైకమాండ్ అనుమతి కోరాలని తెలంగాణ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశాలకు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై

మిగతా 2లో..





## ఫీజు రీయింబర్స్ మెంట్‌పై ఏపీతో పోలికా?

ఏపీలో రూ.3 వేల కోట్లు.. తెలంగాణలో రూ.15 వేల కోట్ల బకాయిలు: అంజిరెడ్డి

మిగిలిన రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

ఆర్. కృష్ణయ్యపై విమర్శలు మానాలి.. అభిషేక్ సింఘ్వీపై సీఎం సమాధానం చెప్పాలని ప్రశ్న

బీసీ నాయకులను దూషించడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమన్న బీజేపీ ఎమ్మెల్సీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో ఏపీ బకాయిలతో తెలంగాణను పోల్చడం ఎందుకని, ఏపీలో రూ.3 వేల కోట్లు ఉంటే, తెలంగాణలో మాత్రం ఏకంగా రూ.15 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, మిగిలిన రూ.12కోట్ల బకాయిలను

మిగతా 2లో..

## సర్ ప్రక్రియ వేగవంతం చేయండి

కాంగ్రెస్ బీఎల్‌ఏలకు భట్టి ఆదేశాలు

ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

బీఎల్‌ఏలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన

ప్రభుత్వ పథకాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్యానల్ ఏర్పాటు

ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యమన్న కాంగ్రెస్

పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై సమీక్ష

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో బుధవారం జరిగిన తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్/సర్) ప్రక్రియ, పార్టీప్రభుత్వ సమన్వయం, రానున్న ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో

మిగతా 2లో..



## కాళేశ్వరంపై కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు..

నాణ్యత లోపాలతోనే బ్యారేజీలు దెబ్బతిన్నాయి

కాళేశ్వరం నిర్మాణ లోపాలపైనే ప్రస్తుత సమస్యలు

23 టీఎంసీల నీరు ఉంచాల్సిన బ్యారేజీలో 10 టీఎంసీలు ఎందుకు నిల్వ చేశారని

ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం

నిపుణుల సాయంతో మరమ్మతులు పూర్తి చేస్తామన్న మంత్రి

రైతులకు నీరు అందించేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తామని హామీ

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాల కారణంగానే ప్రస్తుతం సమస్యలు తలెత్తాయని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టును సక్రమంగా నిర్మించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి..

మిగతా 2లో..



# తెలంగాణకు భారీ వర్ష హెచ్చరిక

- **ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
- **తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు**
- **ఇవాళ, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం**
- **ఆరు జిల్లాలకు ఆరెంజ్.. 17 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు**
- **ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణపై వాతావరణ శాఖ ప్రత్యేక దృష్టి**
- **హైదరాబాద్‌లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంటూ ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.


హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అదే విధంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతంగా ఉండటంతో పాటు ఒకటి, రెండు సందర్భాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అలాగే ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు హెచ్చరించారు.

# ఆర్ఎస్ఎస్ వల్లే విద్యావ్యవస్థ నాశనం

**మొదటిపేజీ తరువాయి**



కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ ఉపయోగించిన ఓ పదంపై భాజపా సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని, వారి ఆవేదనను అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాయని రాహుల్ గాంధీ అన్నారు. పేపర్ లీక్ ఘటనలతో తీవ్ర నిరాశకు గురైన విద్యార్థులు చివరకు ఢిల్లీలో శాంతియుత నిరసనకు దిగారని చెప్పారు. అయితే వారిని రెచ్చగొట్టేలా పోలీసులు వ్యవహరించారని ఆరోపించారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులతో తాను మాట్లాడానని, ప్రభుత్వంలో ఉన్నవారు తమ బాధను పట్టించుకోవడం లేదని వారు చెప్పారని వెల్లడించారు.

విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. చదువు ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారిందని, విద్యార్థుల చదువుల కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. విద్యావ్యవస్థలో ప్రైవేటీకరణ పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ వ్యవస్థను ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ప్రతీక మాత్రమేనని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్‌నేనని ఆరోపిస్తూ, విశ్వవిద్యాలయాల్లో కూడా ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారినే వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నారని అన్నారు.

విద్యార్థులపై పోలీసుల చర్యలను ప్రస్తావిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కూడా రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పెలెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలని అమిత్ షా ఆదేశించారని ఆరోపిస్తూ, ఈ అంశంపై సభకు వచ్చి సమాధానం చెప్పే ధైర్యం హోంమంత్రికి లేదని విమర్శించారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై భాజపా సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల పేరుతో అధికార పక్ష సభ్యులను అవమానించేలా మాట్లాడారని ఆరోపించారు. ముఖ్యంగా అమిత్ షాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. అమిత్ షా పేరును ప్రస్తావిస్తూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగడంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం స్పీకర్ జోక్యం చేసుకుని, అభ్యంతరకరంగా భావించిన కొన్ని వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు.

# సర్ ప్రక్రియ వేగవంతం చేయండి

**మొదటిపేజీ తరువాయి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా ఇన్‌చార్జులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బీఎల్ఏలు సమర్థంగా పనిచేస్తున్నారని వారిని అభినందించారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 36 వేల మంది బీఎల్ఏలను నియమించామని తెలిపారు. ప్రస్తుతం 50 నుంచి 60 శాతం వరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తైందని, మరో రెండు మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. అర్హులైన ఓటర్ల ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దురుద్దేశంతో సాగుతోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల పేర్లు తొలగిపోకుండా కాపాడటమే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పార్టీ సంస్థాగత బలోపేతం, పార్టీ-ప్రభుత్వ సమన్వయం, ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థంగా చేరవేయడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పార్టీ కార్యాచరణ, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై కూడా కాంగ్రెస్ నాయకత్వం సమీక్ష నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# ప్రమాదంలో సింగరేణి అస్తిత్వం

**మొదటిపేజీ తరువాయి**

బొగ్గు బ్లాక్‌కు వేలం నిర్వహించడం ద్వారా సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని కవిత విమర్శించారు.

సింగరేణి కూడా వేలంలో పాల్గొంటుందని ప్రకటించినప్పటికీ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా టీఎస్ జెన్‌కోను కూడా వేలంలో పాల్గొనేలా ప్రయత్నాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. బొగ్గు తవ్వకాల్లో వందల ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను బరిలోకి దింపడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

జెన్‌కో పేరుతో బొగ్గు బ్లాకులను దక్కించుకుని, అనంతరం అనుభవం లేదనే పేరుతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్రకు ప్రభుత్వం తెరతీసిందని కవిత ఆరోపించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బొగ్గు బ్లాకులను వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణికే కేటాయించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ జెన్‌కోను వేలం ప్రక్రియ నుంచి తప్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

# హైడ్రాపై కేటీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- **బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే మాట్లాడుతున్నారు: తుమ్మల**
- **హైడ్రాపై బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి తుమ్మల కౌంటర్**
- **బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను అందులో వేస్తామంటున్నారు' అంటూ ఎద్దేవా**
- **ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడి**
- **ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న మంత్రి**
- **గాంధీభవన్ ప్రజలకు సమస్యల పరిష్కార వేదికగా మారిందని వ్యాఖ్య**

**హైదరాబాద్, :**

హైడ్రాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘాటుగా స్పందించారు. బంగాళాఖాతంలో మునిగిపోయిన వారే హైడ్రాను కూడా అందులో వేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

మీడియాతో మాట్లాడిన తుమ్మల నాగేశ్వరరావు.. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ 30 శాతం వర్షపాతం లోటు ఉందన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోందని, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా దీని ప్రభావం కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. ఈ పరిస్థితులపై గ్రామగ్రామాన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, మెట్ట పంటలతో పాటు ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని వెల్లడించారు.

గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా వినతుల కార్యక్రమంపైనా మంత్రి స్పందించారు. గాంధీభవన్‌ను ప్రజలు దేవాలయంగా భావించి తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తున్నారని అన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని తుమ్మల పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో గాంధీభవన్‌కు వస్తున్నారని, ప్రభుత్వం ప్రజా సమస్యల పరి

# తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

**మొదటిపేజీ తరువాయి**

వారు అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం. మరోవైపు తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన అంశంతో పాటు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య కొనసాగుతున్న విభేదాలపైనా హైకమాండ్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గతంగా పరిష్కరించాల్సిన విషయాలను బహిరంగంగా చర్చించడం సరికాదని, అలాంటి చర్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని నేతలకు స్పష్టం చేసినట్లు సమాచారం.పార్టీ లైన్ దాటి బహిరంగ వ్యాఖ్యలు చేయడం సహించబోమని హైకమాండ్ హెచ్చరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ పనితీరు, పార్టీ వ్యవహారాలు సమన్వయంతో ముందుకు సాగాలని, నాయకులందరూ క్రమశిక్షణ పాటించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం.

# తెలంగాణ భూముల లెక్కల్లో భారీ గందరగోళం..

**మొదటిపేజీ తరువాయి**



ధరణి కమిటీని నియమించింది. అనంతరం ఫోరెన్సిక్ ఆడిట్, ఐఏఎస్ అధికారుల కమిటీ పరిశీలనలు జరిగాయి. తాజాగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం 'సెట్' ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అయితే ప్రధాన ప్రశ్న మాత్రం అలాగే మిగిలింది.

ఎన్ని కమిటీలు వేశారు అన్నది కాదు.. ఎన్ని ఎకరాలు తిరిగి స్వాధీనం చేసుకున్నారు? ఎన్ని అక్రమ పట్టాలు రద్దు చేశారు? ఎంతమందిపై కేసులు నమోదు చేశారు?

**తెలంగాణలో మొత్తం భూమి ఎంత?**

తెలంగాణ రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణం సుమారు 1,12,077 చదరపు కిలోమీటర్లు. దీన్ని ఎకరాల్లోకి మార్చితే దాదాపు 2.77 కోట్ల ఎకరాలు, అంటే సుమారు 276.95 లక్షల ఎకరాలు అవుతుంది. ఈ మొత్తం భూమిలో వ్యవసాయ భూములు, అడవులు, ప్రభుత్వ బంజరు భూములు, గుట్టలు, చెరువులు, వాగులు, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, రహదారులు, రైల్వేలు తదితర వర్గాలు ఉన్నాయి.అయితే రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ భూమి ఎంత? అందులో రెవెన్యూ శాఖ ఆధీనంలో ఎంత? అటవీ భూమి ఎంత? దేవాదాయ, వక్ఫ్, భూదాన్, అసైన్డ్, చెరువు శిఖం, నాలా, స్థానిక సంస్థల భూములు ఎంత? వాటిలో ఆక్రమణకు గురైనది ఎంత? అనే ప్రశ్నలకు ప్రజలకు అందుబాటులో ఒకే సమగ్ర, నవీకరించిన అధికారిక లెక్క కనిపించడం లేదు.

వివిధ శాఖలు తమ పరిధిలోని భూములను వేర్వేరు రిజిస్టర్లలో నిర్వహిస్తున్నాయి. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణకు గురైన మొత్తం భూమి ఎంత అనే విషయంపై ఒకే సంఖ్య ప్రకటించడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదు. ప్రభుత్వం జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబర్ వారీగా వివరాలను బహిర్గతం చేసినప్పుడే వాస్తవ చిత్రం బయటపడుతుంది.

**2.31 లక్షల ఎకరాల లెక్కలో కీలక సందేహం**

2014లో పారిశ్రామిక అవసరాల కోసం భూముల వివరాలు సేకరించినప్పుడు రాష్ట్రంలో సాగుకు పనికిరాని ప్రభుత్వ భూమి 17,78,026 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారని చెబుతున్నారు. 2024 నాటికి మొత్తం ప్రభుత్వ భూమి 15,46,975 ఎకరాలు మాత్రమే ఉందని మరో లెక్కను చూపుతున్నారు. ఈ రెండు సంఖ్యల మధ్య వ్యత్యాసం 2,31,051 ఎకరాలు. దీన్నే పదేళ్లలో మాయమైన ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్నారు.కానీ ఇక్కడ ఒక కీలకమైన గణాంకపరమైన సమస్య ఉంది. 2014 లెక్కను 'సాగుకు పనికిరాని ప్రభుత్వ భూమి'గా పేర్కొంటుండగా, 2024 లెక్కను 'మొత్తం ప్రభుత్వ భూమి'గా పేర్కొంటున్నారు. రెండు వేర్వేరు వర్గాల గణాంకాలను నేరుగా పోల్చితే తప్పుదోవ పట్టించే అవకాశం ఉంటుంది. అందువల్ల 2.31 లక్షల ఎకరాలు నిజంగానే ఆక్రమణకు గురయ్యాయని నిర్ధారించాలంటే ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి: 2014, 2024 లెక్కలు ఒకే నిర్వచనం, ఒకే భూ వర్గీకరణ ఆధారంగా రూపొందించారా?జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల రికార్డుల్లో మార్పులు జరిగాయా?ప్రభుత్వ సంస్థలకు బదలాయించిన భూములు ఎంత? ప్రాజెక్టులు, రహదారులు, గృహ నిర్మాణం, పరిశ్రమలకు కేటాయించిన భూమి ఎంత?పట్టా భూమిగా మార్చినది ఎంత? కోర్టు వివాదాల్లో ఉన్న భూమి ఎంత?అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల పేర్లకు మారిన భూమి ఎంత? ఈ వివరాలు లేకుండా మొత్తం వ్యత్యాసాన్ని 'ఆక్రమణ'గా నిర్ధారించడం తొందరపాటు అవుతుంది. అయితే ఇంత భారీ తేడా కనిపించడం మాత్రం సమగ్ర దర్యాప్తు అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

**ధరణి ఫోరెన్సిక్ ఆడిట్‌లో 22 వేల అనుమానాస్పద లావాదేవీలు**

2020 అక్టోబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు ఎనిమిది లక్షల లావాదేవీలను పరిశీలించగా దాదాపు 22 వేల అనుమానాస్పద అంశాలు గుర్తించినట్లు 2026 జూలైలో వార్తలు వెలువడ్డాయి. కొన్ని ప్రత్యేక మాడ్యూళ్లను దుర్వినియోగం చేసి అనధికారిక ఎంట్రీలు చేశారనే అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ అనుమానాస్పద లావాదేవీలన్నీ భూ కబ్జాలేనని వెంటనే నిర్ధారించలేం. వాటిలో సాంకేతిక తప్పులు, డేటా ఎంట్రీ లోపాలు, ద్వంద్వ రికార్డులు కూడా ఉండవచ్చు. కానీ ప్రభుత్వ, నిషేధిత, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, చెరువు భూములకు సంబంధించిన లావాదేవీలు ఉంటే వాటిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించాల్సిందే.ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూ భారతి వ్యవస్థ కూడా గత సాంకేతిక నిర్మాణంపైనే ఆధారపడినందున పాత లోపాలు కొత్త వ్యవస్థలో కొనసాగాయా అనే అంశాన్ని కూడా తాజా కమిటీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ఫీజు రీయింబర్స్ మెంట్‌పై ఏపీతో పోలికా?

**మొదటిపేజీ తరువాయి**

వెంటనే చెల్లించాలని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ నుంచి రాజ్యసభకు వెళ్లిన ఆర్. కృష్ణయ్యను ప్రశ్నిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి..తెలంగాణ నుంచి అభిషేక్ సింఘ్వీని ఎందుకు పంపారో సమాధానం చెప్పాలని కోరారు. బీసీల హక్కుల కోసం పోరాడుతున్న ఆర్. కృష్ణయ్యను, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావును దూషించడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమన్నారు.

మూసీ పునరుద్ధరణకు రూ. 50 వేల కోట్లు, ఫ్యూచర్ సిటీకి రూ.30 వేల కోట్లు కేటాయించడానికి ఉన్న ఉత్సాహం... పేద విద్యార్థుల చదువుల కోసం రూ.15 వేల కోట్లు కేటాయించడానికి లేదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ప్రాజెక్ట్‌ల మీదే ప్రభుత్వ ధ్యాస అంతా...కానీ ఫీజు రీయింబర్స్మెంట్ రాక సర్టిఫికెట్లు అందక ఆగిపోయిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వం కంటికి కనిపించడం లేదా?య అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేస్తామని, నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి, రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పడం మోసం కాదా? అని ప్రశ్నించారు. విద్యార్థుల కోసం బీజేపీ పార్టీ పోరుబాట పట్టేసరికి ఏం చేయాలో తోచక, చేతగాక ప్రభుత్వ పెద్దలు చిల్లర మాటలతో అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. 60 లక్షల మంది విద్యార్థులకు అందాల్సిన సుమారు రూ. 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టు సాక్షిగా ఈ నెల 15 లోపు చెల్లిస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని, బకాయిలు రాక విద్యార్థులు సర్టిఫికేట్లు లేక, ఉద్యోగాలు వచ్చినా చేరలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలం నాటి పథకాన్ని మెరుగ్గా అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ప్రతి నెలా రూ. 200 కోట్లు ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ పేరుతో కాలయాపన చేస్తూ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ దరఖాస్తు రుసుమును రూ. 200 నుండి రూ. 1000కి పెంచి నిరుద్యోగులపై అదనపు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 1000 కోట్లు, నియోజకవర్గానికి ఒక తెలంగాణ స్టడీ సర్కిల్, 'రాజీవ్ యువ వికాసం' వంటి హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలిపోయాయని, విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు కూడా ఇవ్వలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు.

మరొకవైపు 'హైడ్రా' పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కూల్చివేతల తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు ఇచ్చిన అనుమతులతో ఇళ్లు కట్టుకున్న పేదల ఇళ్లను జేసీబీలతో కూల్చివేయడం అత్యంత అన్యాయమని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాలకు బిజెపి వ్యతిరేకమని, అయితే అనుమతులు ఇచ్చిన ఎంఆర్‌ఓలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం పేదల ఇళ్లను కూల్చడం సరైంది కాదని స్పష్టం చేశారు. చెరువుల శిఖం భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంటే వారికి ప్రత్యామ్నాయ భూమి లేదా పరిహారం ఇవ్వాలని, లేదా ప్రజలు భయం లేకుండా ఇళ్లు కట్టుకోవడానికి 'హైడ్రా' ముందే నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలని, లేనిపక్షంలో బీజేపీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# కాళేశ్వరంపై కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు..

**మొదటిపేజీ తరువాయి**

బ్యారేజీలో 2 నుంచి 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ చేయాల్సి ఉండగా, 10 టీఎంసీల వరకు ఎందుకు నిల్వ చేశారని ప్రశ్నించారు. ఈ అంశంపై గత పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. నిపుణుల సలహాలు తీసుకుని వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు మరమ్మతులతో పాటు నీటి నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.



# స్నేహితుడి ఇంట్లో రూ.26 లక్షల చోరీ

- **చిన్ననాటి స్నేహితుడే దొంగ**
- **రూ.17.60 లక్షల నగదు, కారు, మొబైల్ స్వాధీనం**
- **మరో నిందితురాలు పరారీలో**

**కరీంనగర్, జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

కరీంనగర్ రూరల్ పోలీసులు భారీ నగదు చోరీ కేసును ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. చిన్ననాటి స్నేహితుడి ఇంట్లో దాచి ఉంచిన రూ.26 లక్షల నగదును అపహరించిన తగరం శంకర్ లాల్‌ను బొమ్మకల్ బస్‌స్టాప్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితురాలు అడెపు రేష్మ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల కథనం ప్రకారం.. ఫిర్యాదుదారుడు గుడిమల్ల శ్రీనివాస్ ప్రస్తుతం కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి మాణిక్యేశ్వరి నగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. అతడు ఇటీవల వ్యవసాయ భూమి విక్రయించి పెద్ద మొత్తంలో నగదు ఇంట్లో దాచుకున్న విషయం చిన్ననాటి స్నేహితుడైన శంకర్ లాల్‌కు తెలుసు. గతంలో ఇంటికి వెళ్లిన అనుభవంతో ఇంటి నిర్మాణం, అదనపు తాళంచెవి ఉంచే స్థలంపై కూడా అవగాహన ఉండటంతో చోరీకి పథకం రచించాడు. ఈ కుట్రలో అడెపు రేష్మను భాగస్వామిగా చేసుకుని జూన్ నెలలో ఇంటికి వెళ్లాడు. అదనపు తాళంచెవి కనిపించకపోవడంతో ప్రధాన ద్వారం, బాత్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. ప్లాస్టిక్ డ్రమ్‌లో పాత బట్టలు, ఖాళీ సీసాల కింద దాచిన అట్టపెట్టెలో ఉన్న రూ.26 లక్షల నగదును తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. రేష్మ కూడా ఈ చోరీ సమయంలో అక్కడే ఉండి సహకరించినట్లు దర్యాప్తులో తేలింది.

చోరీ చేసిన నగదులో కొంత మొత్తాన్ని ఖర్చు చేయడంతో పాటు మరికొంత మందికి ఇచ్చినట్లు నిందితుడు విచారణలో తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. మిగిలిన సొమ్మును తన వద్దే ఉంచుకున్నాడని తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ కారు, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రేష్మ కోసం గాలింపు చేపట్టారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది కేసును ఛేదించారు. దర్యాప్తు బృందాన్ని కమిషనర్ అభినందించారు. అధిక మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను ఇళ్లలో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసు శాఖ ప్రజలకు సూచించింది.



# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**కోటగిరి జులై 29 ఆశ్వి అప్డేట్స్:**



కోటగిరి మండల కేంద్రంలోని హరిజన వాడలో బుధవారం జెండా గంగారం అనే వ్యక్తి మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు తెల్ల రవి అన్న యువసేన ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబీకులను పరామర్శించిన అనంతరం తెల్ల రవి యువసేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో తెల్ల అరవింద్,తెల్ల రవికుమార్,కాలనీ పెద్దలు కన్నం సాయిలు,కన్నం శ్రీనివాస్,జెండా దినేష్,హస్గుల రవి,పండు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా

# విద్యార్థులకు పులుల సంరక్షణపై అవగాహన

- **పులుల సంరక్షణ - అడవులకు వాటి ప్రాముఖ్యత అంశంపై వ్యాసరచన పోటీ**
- **కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వంశీ**

**కొత్తగూడ జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పులుల సంరక్షణ – అడవులకు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విశేష ఉత్సాహంతో పాల్గొని పులుల పరిరక్షణపై తమ అవగాహనను, ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు. పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయగా, పాల్గొన్న మిగతా విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు.

ఈ సందర్భంగా కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వంశీ మాట్లాడుతూ, పులులు అడవుల సమతుల్య వ్యవస్థకు అత్యంత కీలకమైన జీవులని అన్నారు. పులులు ఉంటేనే అడవులు ఆరోగ్యంగా ఉంటాయని, అడవులు బాగుంటేనే ప్రకృతి సమతుల్యత, వర్షపాతం, జీవవైవిధ్యం పరిరక్షించబడతాయని వివరించారు.

జీవవైవిధ్యంలో పులుల పాత్ర ప్రత్యేకమైనదని వివరించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని, అడవులు, వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పులుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యార్థులే ముఖ్య పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై బాధ్యతాయుతమైన భావన పెంపొందించేందుకు అటవీ శాఖ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుందని రేంజ్ ఆఫీసర్ వంశీ తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఎల్‌నినో ప్రభావం తొలగాలంటూ కొండగట్టులో ప్రత్యేక పూజలు

- **అంజన్నను వేడుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు..**
- **రైతుల సంక్షేమం కోసం గిరిప్రదక్షిణ**

**కరీంనగర్/కొండగట్టు, జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం 43వ గిరిప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాన్ని లెక్కచేయకుండా నేతలు, కార్యకర్తలు, భక్తులు గిరిప్రదక్షిణ పూర్తి చేసి అనంతరం శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అంజన్నను ప్రార్థించినట్లు తెలిపారు. ఇది రాజకీయ కార్యక్రమం కాదని, సకలజనుల సంక్షేమం కోసం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రైతుల కష్టాలు తొలగి రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గిరిప్రదక్షిణ నిర్వహించామని తెలిపారు. భారీ వర్షంలోనూ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తుడికి, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి

# తొలి మెట్టు

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగగా చెప్పుకుంటాం. కానీ ఆ పండుగకు ప్రాణం పోసేది పోలింగ్ కేంద్రం కాదు, ఓటర్ల జాబితా. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించే పునాది అదే. ఓటర్ల జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉంటే ప్రజాస్వామ్యం అంత బలంగా నిలుస్తుంది. అందుకే ఓటర్ల జాబితా రూపకల్పనను కేవలం పరిపాలనా కార్యక్రమంగా కాకుండా, ప్రజాస్వామ్యానికి మొదటి రక్షణ కవచంగా చూడాల్సిన అవసరం ఉంది.

ఇటీవలి కాలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికల కమిషన్ దీని ఉద్దేశాన్ని ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడం, అర్హులైన వారిని చేర్చడం, అనర్హ నమోదులను తొలగించడం అని వివరిస్తోంది. మరోవైపు, ప్రతిపక్ష పార్టీలు, కొన్ని పౌర సంఘాలు, ఎన్నికల పరిశీలకులు మాత్రం ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి భిన్నాభిప్రాయాలు సహజమే. అయితే, ఆ అనుమానాలకు పారదర్శక సమాధానాలు ఇవ్వడం కూడా అంతే అవసరం.

భారత రాజ్యాంగం ప్రతి వయోజన పౌరుడికి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని కల్పించింది. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలు, ప్రభుత్వాల రూపకల్పన అన్నీ ఓటు ద్వారానే ప్రతిఫలిస్తాయి. అందుకే ఓటర్ల జాబితాలో ఒక్క పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. అదే సమయంలో అర్హతలేని నమోదులు కొనసాగకూడదు. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతను కాపాడటం ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన బాధ్యత.

ప్రజాస్వామ్యంలో విశ్వాసం చట్టాల వల్ల మాత్రమే కాదు; ఆ చట్టాల అమలుపై ప్రజలకు కలిగే నమ్మకం వల్ల కూడా నిలుస్తుంది. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. అందువల్ల అది తీసుకునే ప్రతి నిర్ణయం రాజకీయాలకు అతీతంగా కనిపించడమే కాదు, ప్రజలకు అలా అనిపించేలా కూడా ఉండాలి. పారదర్శక విధానాలు, సమయానికి సమాచారం, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిష్కార వ్యవస్థ——ఇవన్నీ ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేస్తాయి.

సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను రాజ్యాంగంలోని ప్రాథమిక ప్రజాస్వామ్య విలువలలో భాగంగా పేర్కొంది. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటర్ల జాబితా విశ్వసనీయత, ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం——ఈ మూడు అంశాలు ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. ప్రజాస్వామ్య బలం కేవలం ఓట్ల లెక్కింపులో కాదు; ఓటు వేసే హక్కు ప్రతి అర్హుడికి సమానంగా అందుబాటులో ఉండటంలో ఉంది.


ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. ఒకరి పేరు తొలగించే ముందు కారణాలు తెలియజేయడం, వివరణ ఇచ్చే అవకాశం కల్పించడం, అవసరమైతే అప్పీల్ చేసుకునే అవకాశం ఉండడం ప్రజాస్వామ్య పరిపాలనలో అత్యంత కీలకమైన అంశాలు. అలా జరిగితేనే ప్రజల్లో అనుమానాలకు తావు తగ్గుతుంది.

ఇక్కడ రాజకీయ పార్టీల బాధ్యత కూడా తక్కువ కాదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా వ్యవహరించడం అన్ని పార్టీల బాధ్యత. లోపాలు ఉంటే ఆధారాలతో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. చట్టబద్ధ మార్గాల్లో పరిష్కారాలు కోరాలి. అలాగే ఎన్నికల కమిషన్ కూడా అన్ని రాజకీయ పార్టీలతో నిరంతర సంభాషణ కొనసాగిస్తూ సందేహాలను నివృత్తి చేయాలి.

పౌరుల బాధ్యత మరింత కీలకం. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన వెంటనే ప్రతి ఒక్కరూ తమ పేరు ఉందో లేదో పరిశీలించాలి. పేరు లేకుంటే వెంటనే దరఖాస్తు చేయాలి. కొత్తగా అర్హత పొందిన యువత నమోదు చేసుకోవాలి. చిరునామా మారిన వారు వివరాలు సవరించుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఈ ప్రక్రియ సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల రోజు మాత్రమే జీవించదు. ఎన్నికల ముందు జరిగే ప్రతి ప్రక్రియలో అది ప్రతిబింబిస్తుంది. ఓటర్ల జాబితా రూపకల్పన, నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు——ప్రతి దశ సమానంగా విశ్వసనీయంగా ఉండాలి. ఈ గొలుసులో తొలి కడియం ఓటర్ల జాబితానే. అదే బలహీనమైతే మొత్తం వ్యవస్థపై ప్రభావం పడుతుంది.దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం కేవలం ఎన్నికల కమిషన్ లేదా రాజకీయ పార్టీల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యత కూడా అదే. తన ఓటు హక్కును పరిరక్షించుకోవడం, ఇతరులను కూడా చైతన్యవంతులను చేయడం, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేస్తాయి.

చివరగా చెప్పాల్సింది ఒక్కటే. ఎన్నికల్లో గెలుపు-ఓటములు మారుతూ ఉంటాయి. ప్రభుత్వాలు వస్తుంటాయి, వెళ్తుంటాయి. కానీ ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం దెబ్బతినకూడదు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది ఖచ్చితమైన, పారదర్శకమైన, అందరికీ సమాన న్యాయం చేసే ఓటర్ల జాబితా. ప్రతి అర్హుడి ఓటు విలువైనదే. ఆ విలువను కాపాడుకోవడం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు అత్యంత అవసరం.





# భగత్‌నగర్ డెకాయిటి కేసు ఛేదన

- **అల్లుడు, మనుమడే సూత్రధారులు ముగ్గురు అరెస్ట్...**

**కరీంనగర్, జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

భగత్‌నగర్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన ఇంటి డెకాయిటీ కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి సొంత అల్లుడు రజావుద్దీన్, మనుమడు అజీమ్ రజానే ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులని పోలీసులు వెల్లడించారు. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో అర్ధరాత్రి సమయంలో డమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడిన దుండగులు కుటుంబ సభ్యులను బెదిరించి, వారి చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఘటనాస్థలం పరిసరాలతో పాటు నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. దోపిడీ అనంతరం దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లి, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలివేసినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితులు మీరట్‌కు చెందిన వారని నిర్ధారించారు. ప్రత్యేక బృందాలు మీరట్‌కు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టగా, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్ వద్ద రూ.84 వేల నగదు, 11.95 గ్రాముల బంగారం, సల్మాన్ అలియాస్ విమాన్ వద్ద రూ.67 వేల నగదు, 11.71 గ్రాముల బంగారం, మొహమ్మద్ హసీన్ వద్ద రూ.58 వేల నగదు, 14.01 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో బాధితుడి అల్లుడు రజావుద్దీన్, మనుమడు అజీమ్ రజా ఈ దోపిడీకి పథకం రచించినట్లు తేలింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింట్లో ఉండటంతో రజావుద్దీన్ పలుమార్లు డబ్బులు డిమాండ్ చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు చికిత్స చేయించి, వ్యాపారం కోసం ఆర్థిక సాయం చేసినప్పటికీ, వ్యాపారంలో నష్టపోయిన అనంతరం మరోసారి రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. నిరాకరించడంతో మీరట్‌కు వెళ్లి అక్కడి వ్యక్తులతో కలిసి దోపిడీకి కుట్ర పన్నాడు.

కరీంనగర్‌లో ఉన్న సమయంలో ఇంట్లోని నగదు, ఆభరణాల వివరాలను తెలుసుకున్న రజావుద్దీన్ తన కుమారుడు అజీమ్ రజా, మరో ముగ్గురితో కలిసి ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకుని, 21వ తేదీ అర్ధరాత్రి బాధితుడి ఇంట్లోకి ప్రవేశించి డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బెదిరించి దోపిడీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. అరెస్టయిన ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజాతో పాటు ఇతరుల కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలింపు కొనసాగిస్తున్నాయి.

# దేవుని గుట్ట తాండలో సంత్ రామ్ రావ్ మహారాజ్ 91వ జయంతి వేడుకలు

**కోటగిరి,జులై 29 ఆశ్వి అప్డేట్స్:**

సంత్ శ్రీ రామ్ రావ్ మహారాజ్ 91 జయంతి వేడుకలను కోటగిరి మండలం దేవుని గుట్ట తాండ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ భండార్ నిర్వహించి జగదంబ సేవలాల్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ వంశంలోని రామావత్ గోత్రానికి చెందిన ఏడవ తరం వారసులు వారు పౌరా దేవి క్షేత్రంలోని వాషింగ్ జిల్లా మహారాష్ట్ర వారు ప్రతి తాండల్లో తిరుగుతూ మూఢ నమ్మకాన్ని మూఢ నమ్మకం నిర్మూలన విద్యా వ్యాప్తికి జీవితం మొత్తం కృషి చేశారని గుర్తు చేశారు.ప్రతి తాండలో గుడి బడి అనేది ఉండాలని సద్గురు మార్గంలో నడవాలని వారు భూదాన కార్యక్రమాలు చేసేవారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు సీతారాం నాయక్,ఆలయ కమిటీ చైర్మన్ తాండ కారోభారీ దేవుల మెగావత్ పుండలిక్,గుడి పూజారి రూప్ సింగ్,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు ఫకీరా నాయక్,సేవాలాల్ సేన అధ్యక్షులు తారా సింగ్, ఉపాధ్యక్షులు రామ్ కిషన్, కితావత్ సురేష్,సురేష్,వడిత్య తారా సింగ్,కొర్ర విట్టల్,శంకర్,యశ్వంత్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## ఝార్ఖండ్‌లో ఈడీ భారీ దాడులు.. ₹1.5 కోట్లు నగదు, ₹150 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

**ఆశ్వ అప్డేట్ | ధన్‌బాద్ | జూలై 29**

ఝార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ జిల్లాలో అక్రమ బొగ్గు వ్యాపారం, మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) బుధవారం భారీ స్థాయిలో సోదాలు నిర్వహించింది. ఈ దాడుల్లో భాగంగా ధన్‌బాద్‌తో పాటు పలు ప్రాంతాల్లోని 25కు పైగా ప్రదేశాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టిన అధికారులు, సుమారు ₹ 1.5 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ₹ 150 కోట్లకు పైగా విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాల్లోని నిధులను గుర్తించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. అక్రమ బొగ్గు వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ కార్యకలాపాలపై అందిన సమాచారంతో ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఆర్థిక పత్రాలు, బ్యాంకు రికార్డులు, ఇతర ఆధారాలను ఈడీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం, ఝార్ఖండ్‌లో ఇప్పటివరకు ఈడీ నిర్వహించిన దాడుల్లో ఇది అత్యంత పెద్ద మొత్తాల స్వాధీనం, ఆస్తుల గుర్తింపుగా భావిస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, సేకరించిన ఆధారాల ఆధారంగా తదుపరి న్యాయపరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఈడీ నుంచి పూర్తి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## విద్యార్థుల ఫిర్యాదుపై సాయంత్రం 5 గంటల్లోగా డైరీ నమోదు చేయాలి: ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**ఆశ్వ అప్డేట్ | న్యూఢిల్లీ | జూలై 29**

విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుకు సంబంధించిన ఫిర్యాదును బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా కేసు డైరీలో నమోదు చేయాలని ఢిల్లీ హైకోర్టు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)ను ఆదేశించింది. ఈ కేసులో ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, జాయింట్ కమిషనర్ సందీప్ లాంబాతో పాటు ఇతర పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పిటిషనర్లు కోర్టును కోరారు. జూలై 23న ఫిర్యాదు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు డైరీ నంబర్ లేదా ఫిర్యాదు స్వీకరించినట్లు ఎలాంటి రసీదు ఇవ్వలేదని పిటిషనర్లు హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ఢిల్లీ పోలీసులు, సాంకేతిక సమస్యల కారణంగానే ఆలస్యం జరిగిందని కోర్టుకు వివరించారు. సాయంత్రం 5 గంటల్లోగా ఫిర్యాదును కేసు డైరీలో నమోదు చేసి, డైరీ నంబర్‌తో పాటు అంగీకార రసీదును పిటిషనర్లకు అందజేస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీని నమోదు చేసిన ఢిల్లీ హైకోర్టు, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది.

## గురు పౌర్ణమి సందర్భంగా గురువులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**ఆశ్వ అప్డేట్ | హైదరాబాద్**

పవిత్రమైన గురు పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, గురువులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గురు పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మన జీవితాన్ని మలిచిన గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే పవిత్రమైన రోజు. గురువు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, వారి బోధనలను ఆచరిస్తే ప్రతి అడుగూ విజయానికి నాంది అవుతుంది" అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువులు జీవితానికి అర్థాన్ని, లక్ష్యాన్ని అందిస్తారని సీఎం అన్నారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించడమే కాకుండా, ప్రతి వ్యక్తిలోని సామర్థ్యాన్ని గుర్తించి క్రమశిక్షణ, విలువలు, ధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి అమూల్యమైన గుణాలను పెంపొందించడంలో గురువుల పాత్ర అపారమని కొనియాడారు. గురువులు చూపిన ఆదర్శ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ, వారి బోధనలను జీవితంలో ఆచరణలో పెట్టాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



## ఆధ్యాత్మికతతోనే మనస్సు ప్రశాంతం: మంత్రి శ్రీధర్ బాబు

**ఆశ్వ అప్డేట్ | హైదరాబాద్ | జూలై 29**

గురు పౌర్ణమి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రశాంతి హిల్స్ డివిజన్ పరిధిలోని నందిహిల్స్ కాలనీలో శ్రీ దత్త సిద్ధాంతకర్త శ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలోనూ, ప్రతి ఇంట్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం ఉంటేనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. గురువుల బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (KLR) మాట్లాడుతూ, ప్రతి వ్యక్తిలోనూ అపారమైన అంతరంగిక శక్తి దాగి ఉంటుందని, గురువుల ఆశీస్సులతో ఆ శక్తిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో "రహస్య తత్త్వార్థ బోధనలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి తదితరులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, ఏలిమేటి అమరేందర్ రెడ్డి, సామిడి గోపాల్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆదేశాలు

- **డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే యోచనలో తెలంగాణ ప్రభుత్వం**

**ఆశ్వ అప్డేట్ | హైదరాబాద్ | జూలై 29**

హైడ్రా (HYDRAA) కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఈ వ్యవహారంపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రస్తుతం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్నందున ఆయన హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన అనంతరం ఈ అంశంపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేయాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాల అమలు, న్యాయపరమైన అంశాలు, పరిపాలనా ప్రభావం తదితర విషయాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో న్యాయశాఖ, సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ముఖ్యమంత్రి తిరిగి వచ్చిన తర్వాతే తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



## తెలంగాణలో 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**ఆశ్వ అప్డేట్ | హైదరాబాద్**

తెలంగాణలో పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖలోని వివిధ ఖాళీల భర్తీకి మొత్తం 7,437 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు వెల్లడించింది.


**ఎస్ఐ పోస్టులు**
ఎస్ఐ (సివిల్) - 148
ఎస్ఐ (ఏఆర్) - 14
టీజీఎస్‌పీ ఎస్ఐ - 12
ఎస్ఏఆర్‌సీపీఎల్ ఎస్ఐ - 3
ఎస్ఐ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) - 23

**కానిస్టేబుల్ పోస్టులు**
కానిస్టేబుల్ (సివిల్) - 3,697
కానిస్టేబుల్ (ఏఆర్) - 1,052
పీటీవో కానిస్టేబుల్ - 20
కానిస్టేబుల్ మెకానిక్ - 7
స్పెషల్ పోలీస్ - 44
ఇతర కానిస్టేబుల్ పోస్టులు - 1,038

**అగ్నిమాపక శాఖ**
స్టేషన్ ఫైర్ ఆఫీసర్ - 39
ఫైర్ ఫైటర్ - 751

**జైళ్ల శాఖ**
డిప్యూటీ జైలర్ (పురుషులు) - 14
డిప్యూటీ జైలర్ (మహిళ) - 1
వార్డర్ (పురుషులు) - 196
వార్డర్ (మహిళలు) - 12

పోలీసు నియామక మండలి ప్రకారం, దరఖాస్తుల తేదీలు, అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలను త్వరలో విడుదల చేయనున్నారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ విడుదలైన తర్వాత మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, తాజా సమాచారాన్ని TGPRB అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.








## యాదాద్రి జిల్లాలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పోలీసులు

**ఆశ్వ అప్డేట్ | యాదాద్రి భువనగిరి | జూలై 29**

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులు, విద్యార్థులు, ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి రోడ్డు భద్రతా నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు.
ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్య కూడళ్ల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని విజ్ఞప్తి చేశారు.




## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సూర్యాపేట ఎస్పీ

**సూర్యాపేట, జూలై 29:**

సైబర్ మోసాల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు త్వరగా నగదు రిఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రజలు అపరిచితుల కాల్స్, లింకులు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు పంచుకోవద్దని సూచించారు. మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## పారదర్శక ఓటర్ల జాబితాయే లక్ష్యం: తహసీల్దార్ విజయ్‌కుమార్

**ఆశ్వ అప్డేట్స్ | చిట్యాల | జూలై 29**

పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారే లక్ష్యంగా ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చిట్యాల తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల బదిలీలు, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై చర్చించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు స్వీకరించారు. ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా సవరణ కీలకమని, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలా పూర్తి సహకారం అందిస్తామని రాజకీయ పార్టీల నాయకులు హామీ ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి..

- **దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**ఆశ్వ అప్డేట్ | కోల్‌కతా | జూలై 29**

పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్ క్యాంపస్‌లో బుధవారం ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతుడు *దీపక్ రెడ్డి పుల్లగురం (36)*గా గుర్తించారు. ఆయన హైదరాబాద్‌కు చెందినవారు కాగా, ఐఐటీ ఖరగ్‌పూర్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం, దీపక్ రెడ్డి ఉదయం నుంచి స్పందించకపోవడంతో క్యాంపస్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకు హిజ్లీ అవుట్‌పోస్ట్ పోలీసులు క్యాంపస్‌కు చేరుకుని, భద్రతా సిబ్బంది సహాయంతో ఆయన క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. అక్కడ ఆయన ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు.
వెంటనే ఆయనను ఐఐటీ క్యాంపస్‌లోని బి.సి. రాయ్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.
ఘటన స్థలంలో ఆత్మహత్యకు సంబంధించిన లేఖ లభించిందా లేదా అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
దీపక్ రెడ్డి నివాసాన్ని పోలీసులు సీజ్ చేసి పరిశీలిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భద్రతా సిబ్బంది, సహోద్యోగులు, క్వార్టర్స్ నివాసితులను విచారిస్తూ ఘటనకు దారితీసిన కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నాయా, ఉద్యోగ సంబంధిత ఒత్తిడి ఎదుర్కొన్నారా అనే కోణాల్లో కూడా దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.
పశ్చిమ మిద్నాపూర్ జిల్లా ఎస్పీ పాపియా సుల్తానా మాట్లాడుతూ, "ప్రొఫెసర్ మృతదేహం ఉరివేసుకున్న స్థితిలో లభించింది. పోస్టుమార్టం అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడవుతాయి. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది" అని తెలిపారు.
కాగా, ఈ ఘటనపై ఐఐటీ ఖరగ్‌పూర్ యాజమాన్యం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఇటీవల కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నప్పటికీ, క్యాంపస్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక అధ్యాపకుడు ఈ విధంగా మృతి చెందడం ఇదే తొలిసారి అని సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి.







# గౌతమి పాఠశాలలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం.. మహిళల భద్రతకు తెలంగాణ పోలీసుల ప్రత్యేక ప్రాధాన్యం: అడిషనల్ ఎస్పీ రమేష్

**ఆశ్వి అప్డేట్ | నల్లగొండ | జూలై 29**

నల్లగొండ జిల్లాలో మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా షీ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని గౌతమి ఇంగ్లీష్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ అడిషనల్ ఎస్పీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, స్టాకింగ్, సోషల్ మీడియా ద్వారా వేధింపులు, బ్లాక్‌మెయిల్, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు ఇటువంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

అనంతరం షీ టీం అధికారులు మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న సేవలు, అత్యవసర సహాయ నంబర్లు, భరోసా కేంద్రాల సేవలు, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఎస్ఐ అమీన్, రూరల్ ఎస్ఐ శివకుమార్, షీ టీం ఎస్ఐ గౌస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నీళ్లు ఉండి.. పంటలు వేయొద్దనడం దారుణం

- **జూరాల కాలువలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి**
- **ఎల్‌నినోను సాకుగా చూపి రైతులను భయపెడుతున్నారు..**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్ర విమర్శలు**

**వనపర్తి,జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు పంటలు వేయొద్దని ప్రభుత్వం చెప్పడం దారుణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సాగునీటి విషయంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు నుంచి వెంటనే కాలువలకు సాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆత్మకూరు మండల కేంద్రంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్ నివాసంలో బుధవారం మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉన్నాయని చెప్పి పంటలు సాగు చేయొద్దని రైతులకు సూచించడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని నిరంజన్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ద్వారా నీటిని అందిస్తే గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే సాగునీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నీళ్లు లేవనే భ్రమను కావాలనే సృష్టిస్తున్నారని అన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో కొంత వర్షాభావ పరిస్థితి ఉన్నప్పటికీ పశ్చిమ కనుమల్లో కురిసే వర్షాల వల్ల కృష్ణా, తుంగభద్ర, భీమా నదులకు సమృద్ధిగా నీరు చేరుతుందని పేర్కొన్నారు. తుంగభద్ర ద్వారా శ్రీశైలానికి భారీగా వరద వస్తుందని, రాష్ట్ర అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉంటుందని వివరించారు. తాగునీటి పేరుతో సాగునీటిని అడ్డుకోవడం సరికాదని, నీటి వినియోగంపై మంత్రులు స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో తగినంత నీటి నిల్వలు ఉన్నాయని, కర్ణాటకలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఉందన్నారు. అక్కడ సాగు ప్రారంభమైతే జూరాల ప్రాజెక్టుకు కూడా నిరంతర నీటి ప్రవాహం కొనసాగుతుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా రూపొందించినప్పటికీ, ప్రాజెక్టు పనులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. గత యాసంగిలో జూరాల ఆయకట్టు రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారని, ఇప్పుడు వానాకాలంలో కూడా అదే పరిస్థితి తీసుకురావాలని చూస్తున్నారని విమర్శించారు. జూరాల నుంచి ఈ సీజన్ మొత్తం కాలువలకు నీటిని



విడుదల చేయాలని, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అన్ని పంపులను నిరంతరాయంగా నడిపి రిజర్వాయర్లను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా వెళ్లి పోరాడేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించేవారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. వరద వచ్చిన తర్వాత కూడా ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో నడపలేదని, పాలమూరు రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి కోసం రైతులు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సాగునీటి విడుదలపై స్పష్టత లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం ఇకనైనా రాజకీయాలు పక్కనపెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని కోరారు. లేకుంటే రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, పలుస రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వనపర్తి నియోజకవర్గం లో గుడిసెలకు గుడ్‌బై!

**వనపర్తి,జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎక్కడా జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు.

**పనులు ప్రారంభించకపోతే ఇళ్లు రద్దు**

మొదటి విడతలో ఇళ్లు మంజూరై కూడా ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.వారు నిర్మాణాలు చేపట్టని పక్షంలో నిబంధనల మేరకు ఆ ఇళ్లను రద్దు చేసి,నిజమైన అర్హులైన పేదలకు కేటాయించాలని స్పష్టం చేశారు.

# మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**ఆశ్వి అప్డేట్ | వికారాబాద్ | జూలై 29**

వార్షిక తనిఖీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ బుధవారం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డివిజన్ డీఎస్పీ శ్రీ అంజయ్య బొకే అందజేసి జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికారు.

ముందుగా పోలీసు సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణలో సన్నద్ధత, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.


అనంతరం జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, స్టేషన్ హౌస్ రికార్డులు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తు, పోక్సో కేసుల పురోగతి, ఎన్‌డీపీఎస్ కేసులు, మాల్ఖానా నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సీసీటీఎన్ఎస్ నమోదు, ఈసాక్ష్య (eSakshya) అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ, సీసీటీవీ కెమెరాల పనితీరు, వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల వినియోగాన్ని సమీక్షించారు. గ్రామాలు, పట్టణాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్లు (వీపీఓలు) ప్రజలతో నిరంతరం సమన్వయం పెంపొందిస్తూ వికారాబాద్ సురక్ష మిత్ర కార్యక్రమం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాల నివారణ, మహిళలు, చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం, నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ, అనుమానాస్పద వ్యక్తుల తనిఖీలు, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

తనిఖీ అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీ అంజయ్య, మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. వెంకట్, ఎస్ఐ శ్రీ భారత్ భూషణ్, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





# షాబాద్ సీఐ లక్ష్మీ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కోళ్ల యాదయ్య, ప్రజాప్రతినిధులు

**షాబాద్,జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల సీఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ రెడ్డిని స్థానిక ప్రముఖులు కోళ్ల యాదయ్యతో పాటు ప్రవీణ్ గౌడ్, కృష్ణ, శ్రీనివాస్, సత్తయ్య, యాదయ్య, నవీన్, క్రాంతి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన నాయకులు, షాబాద్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ నమ్మకమైన పోలీసు వ్యవస్థను అందించాలని కోరారు.

అనంతరం మండలంలోని శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు, విద్యార్థుల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, యువతలో చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల విస్తరణ, గ్రామాల్లో పోలీసు-ప్రజల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కీలకమని, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా మాదకద్రవ్యాల విక్రయాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# భీమా స్టేజి–2 నుంచి సాగునీటి విడుదల

- **92 వేల ఎకరాలకు జీవధార**
- **ఎల్‌నినో ప్రభావం ఉన్నా రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు**
- **ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి,**

**వనపర్తి,జూలై 29 ఆశ్వి అప్డేట్స్:**

ఖరీఫ్ సాగుకు ఊరట కల్పించేలా భీమా స్టేజి-2 ప్రాజెక్టు నుంచి బుధవారం దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి నీటి విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, 92 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోయినా రైతులు ఇబ్బందులు పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యగా సాగునీటిని విడుదల చేసిందన్నారు. రైతు పొలం పచ్చగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైన మేరకు నీటి సరఫరా నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని పేర్కొన్నారు. సాగునీటి కల్పనతో పాటు రైతు పెట్టుబడి సహాయం, రుణమాఫీ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

నేడు భీమా స్టేజి-2 ద్వారా విడుదలవుతున్న సాగునీరు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ఫలితమేనని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని, రైతు జీవితాల్లో స్థిరమైన మార్పుకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాటలు వేసిందన్నారు.గత పదేళ్ల పాలనలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టును కూడా నిర్మించని వారు నేడు సాగునీటి అంశంపై మాట్లాడటం ఆశ్చర్యకరమన్నారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నీటి విడుదల జరుగుతుండగా వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, సాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# వర్షంలోనూ ఎస్ఐఆర్‌పై సంతోష్ రెడ్డి ప్రచారం

**నాచారం, జూలై 29ఆశ్వి అప్డేట్స్:**

ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్‌కు ప్రభుత్వం నిర్దేశించిన చివరి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడాల సంతోష్ రెడ్డి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నాచారం డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. అవసరమైన వారికి ఫారాలు నింపడంలో సహకరిస్తూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచారాన్ని నిరంతరం కొనసాగిస్తూ గడపగడపకు చేరుకుని ఓటర్లలో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



# చిరు ధాన్యాలు తినేయండి బాస్..!



ఉదయం నిద్ర లేచింది మొదలు.. పడుకొనే వరకు అంతా జంక్ ఫుడ్ కు అలవాటు పడ్డారు. బయట కనిపించిన చిరుతిళ్ల వదలడం లేదు. ఇక ఇంట్లో కూడా ఆయిల్ ఫుడ్స్, నిలువ చేసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినేస్తున్నారు. దీంతో ఎప్పుడో 80 ఏండ్లకు రావాల్సిన జబ్బులు.. 20 ఏండ్లకు 30 ఏండ్లకే వస్తున్నాయి. అయితే జంక్ ఫుడ్ ప్లేస్ లో ఎక్కువ ఫైబర్ ఉండే చిరు ధాన్యాలు తీసుకోవాలని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి రోగాలు దూరమవుతాయని చెబుతున్నారు.



### ఏవి చిరు ధాన్యాలు

జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, అవిసెలు వీటిని చిరు ధాన్యాలు.. కొంతమంది సిరి ధాన్యాలు అని పిలుస్తూ ఉంటారు. వీటిలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు, పీచు పదార్థాలు, బీ కాంప్లెక్స్ విటమిన్లతో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుందని చెబుతున్నారు.

### ఎలా తీసుకోవాలి?

రాగులు, జొన్నలు, సజ్జలు వంటి ధాన్యాల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే వీటిని కొన్ని గంటల పాటు నానబెట్టి తీసుకోవాలని వైద్యులను సూచిస్తున్నారు. శరీరానికి ఫైబర్ అందడంతో పాటూ ఆహారం సక్రమంగా జీర్ణయం అవుతుందని.. జీర్ణ సంబంధిత సమస్యలు, మలబద్ధకం వంటి రోగాలు సైతం దూరం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా పాలిష్ పట్టిన బియ్యం తీసుకోవడం వల్ల రకరకాల సమస్యలు వస్తున్నాయి. అందుకే వాటి స్థానంలో తృణధాన్యాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఆరోగ్య ప్రయోజనాలు

చిరుధాన్యాల్లో ఉన్న పీచు, ఖనిజాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. దీంతో మధు మేహంతో పాటు గుండె సంబంధిత వ్యాధులను కూడా దూరం చేసుకోవచ్చు.

# జుట్టు రాలుతోందా ? ఇలా చేయండి.. !



ఇప్పుడు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరిలోనూ జుట్టు రాలడం అనేది ఓ ప్రధాన సమస్యగా ఉంది. 20 ఏండ్ల వయసు ఉన్న యువతలోనూ ఈ సమస్య కనిపిస్తోంది. బట్టతల లాంటి సమస్యలు కూడా చిన్న వయసులోనే కనిపిస్తున్నాయి. జీవనశైలి. కాలుష్యం వంటి సమస్యలతోనే జుట్టు రాలుతోందట.

### △ కలబందతో పరిష్కారం

జుట్టు రాలే సమస్యను తగ్గించుకొనేందుకు మీరు మార్కెట్లో దొరికే అనేక రకాల ఆయిల్స్ ఇప్పటికే వాడేసి ఉంటారు. అయితే, కొన్ని రకాల షాంపూల కారణంగా జుట్టు రాలడం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సమస్యతో బాధపడేవారు చాలామంది డిప్రెషన్‌లోకి వెళ్ళి, ఈ కారణంగా కూడా జుట్టు రాలడం పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో, నేచురల్ టిప్స్ పాటించడం ద్వారా జుట్టు రాలడం తగ్గించుకోవచ్చు. అందులో కలబంద (అలోవెరా) మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు. ఇక అలోవేరాతో జుట్టు రాలడాన్ని ఎలా చెక్ చేయాలో తెలుసుకుందాం.

### △ అలోవెరా ఉపయోగించాలంటే

అలోవెరా జెల్ ఇలా తయారు చేసుకోండి.. ముందుగా, అలోవెరా ఆకులను తీసుకొని, వాటి నుంచి జెల్‌ను సేకరించాలి.ఈ జెల్‌ను తల మీద మరియు మాడపై అప్లై చేయాలి. జెల్‌ను తలపై 1 గంట పాటు ఉంచాలి. తర్వాత, తక్కువ గాఢత ఉన్న షాంపూ ఉపయోగించి తలను శుభ్రం చేసుకోవాలి. అలోవెరా జెల్ ఆవిరివిడి వలన తలపై వచ్చే ఇన్ఫెక్షన్స్, చుండ్రు, దురద ఇతర చర్మ సమస్యలను కూడా దరమవుతాయి. కొందరికి తల పొడిగా మారడం వల్ల చుండ్రు పెరుగుతుంది, ఇది కాలక్రమేణ జుట్టు రాలడానికి దారి తీస్తుంది. అలోవెరా జెల్ అప్లై చేయడం వల్ల తల హైడ్రేట్‌గా మారుతుంది. ఈ సమస్య కూడా అలోవెరా జెల్ తో మాయం అవుతుంది.

# వర్షా కాలంలో ఈ జాగ్రత్తలు తీసుకోండి





వర్షా కాలంలో ఆరోగ్యం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రోగాలు ప్రబలే సమయం. అంటు వ్యాధులకు ఆస్కారం ఎక్కువ. అందుకే ఈ సీజన్ లో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉండాలి. వర్షా కాలంలో మాంసాహారం తినడం వల్ల ఆహారంతో సంబంధిత వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందవచ్చు. మాంసం సరిగా ఉడికించకపోతే బాక్టీరియా, ప్యారాసైట్స్ వల్ల ఆరోగ్య సమస్యలు కలుగవచ్చు. శాఖాహారం తీసుకోవడం బెటర్. అది కూడా పండ్లు, కూరగాయాలు చేర్చుకోవడంతో లాభం ఉంటుంది. దీని వల్ల జీర్ణశక్తి మెరుగవుతుంది. డయేరియా వంటి వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. వర్షా కాలంలో డ్రింకింగ్ వాటర్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. నీటిని కచ్చితంగా శుభ్రం చేయాలి. కాచి చల్లార్చిన వాటర్ తాగడం మేలు. లేదంటే ఫిల్టర్ చేయడం, శుభ్రత కలిగి ఉండే త్రాగునీటి వనరులు ఉపయోగించడం ద్వారా నీటి జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఆహారం విషయంలోనూ ఎంతో జాగ్రత్తగా ఉండాలి. బయట ఆహార పదార్థాలు తినకపోవడం మంచిది. ఇంట్లోనే వండిన ఆహారాన్ని వేడివేడిగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. దోమల నుంచి తప్పించుకోవడానికి కచ్చితంగా దోమ తెరలు వాడాలి. దోమ కాయిల్స్ వాడొచ్చు. పర్సనల్ హ్యాండ్లింగ్ చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలి. వర్షంలో తడవొద్దు. దీర్ఘకాలిక ఇన్ ఫెక్షన్లతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. మన చుట్టు పక్కన ఉన్న పరిసరాలను కూడా ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఈ సూచనలను పాటించడం వలన వర్షా కాలంలో ఆరోగ్యం రక్షణలో మీరు అధిక సంరక్షణను పొందవచ్చు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

## జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



## తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





## సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

## మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



## బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





## మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



## గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?



ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

## ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రొటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రొటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

## గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

## కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

## బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.


## ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణలు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

## చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.





# జెన్‌జీపై కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు.. అది సిగ్గుచేటంటూ సోనూసూద్ స్ట్రాంగ్ కౌంటర్!

యువతను ఉద్దేశించి బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు, 'రియల్ హీరో' సోనూసూద్ తీవ్ర స్థాయిలో స్పందించారు. నేటి తరం యువతను (Gen Z) 'గట్టర్ జనరేషన్' చెత్త తరం అంటూ కంగన చేసిన వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటని.. ఆమె మాట్లాడే ముందు ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికారు.

**అసలు కంగన ఏమన్నారు?**

ఇటీవల జంతర్ మంతర్ సహా పలు చోట్ల నిరసనల్లో పాల్గొన్న యువత తీరుపై కంగన సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. వారి భాష, ప్రవర్తన అసహ్యం పుట్టించేలా ఉన్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తల్లిదండ్రుల డబ్బుతో డ్రగ్స్, మద్యం సేవిస్తూ యువత స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. నేటి యువతను 'జనరేషన్ గట్టర్' అని పిలుస్తానని, వారి వల్ల వ్యవస్థకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. చదువులో రాణించలేరు, కనీసం ఇంటి బాధ్యతలు కూడా సరిగ్గా నిర్వర్తించలేరంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**సోనూసూద్ ఘాటు రిప్లై..**

ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న సోనూసూద్‌కు ఈ వివాదం ఎదురైంది. తొలుత ఆమె ఏమన్నారో తాను వినలేదని చెప్పిన సోనూసూద్.. ఆ తర్వాత యువత ప్రాముఖ్యతను వివరిస్తూ కంగన వ్యాఖ్యలను తప్పుబట్టారు. 'మనం ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి కారణం యువతే. వారు అండగా ఉన్నంత వరకే మనం ఎదుగుతాం. మీరు ఏ వృత్తిలో ఉన్నా సరే.. ప్రజలతో మమేకం అయినప్పుడే మీ ఉనికికి ఓ అర్థం ఉంటుంది' అని సోనూసూద్ వ్యాఖ్యానించారు. కంగన యువతను ఏకంగా 'గట్టర్' అని సంబోధించారని రిపోర్టర్లు గుర్తు చేయగా.. సోనూసూద్ స్పందిస్తూ.. 'ఆమె నిజంగా అలా అని ఉంటే అది చాలా సిగ్గుచేటు. అలా మాట్లాడకుండా ఉండాల్సింది. ప్రజలే మన పాలిట దేవుళ్లు.. కాబట్టి ఏది పడితే అది మాట్లాడకూడదు.. మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి' అని కంగనాకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.






## ప్యారడైజ్.. ప్రత్యేక పాట సన్నాహాలు

కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం తాజాగా క్లైమాక్స్‌తో పాటు మొత్తం టాకీ పార్ట్‌ని పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పాటల చిత్రీకరణకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక గీతం కోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాట కోసం కీర్తి సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇక మరోవైపు ఆగస్టు తొలి వారంలో ఓ చిన్న టీజర్‌తో విడుదల తేదీపై స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇది 1980ల నాటి సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్నట్లు తెలిసింది. నాని ఇందులో జడల్‌గా విభిన్నమైన పాత్రలో అలరించనున్నారు. మోహన్‌బాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు నెలాఖరున తెరపైకి తీసుకు రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

## మిస్టరీ థ్రిల్లర్‌కు హారర్ మేళవింపుగా జాక్వెలిన్ చిత్రం?

వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి.. మరోవైపు కుర్రకారుని ఉర్రూతలూగించే ప్రత్యేక గీతాలతో ఆకట్టుకుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఈ మధ్యే 'వెల్‌కమ్ టు ది జంగిల్'లో కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది. జాక్వెలిన్ ఓ హారర్ జానర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ సినిమాని హిందీ చిత్రం 1964లో వచ్చిన 'వహ్ కౌన్ థీ' మిస్టరీ థ్రిల్లర్ ఆధారంగా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ''జాక్వెలిన్ ఓ హారర్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించేందుకు అంగీకరించారు. ఈ సినిమాని భయానక వాతావరణంతో కూడిన ఓ చిన్న గ్రామంలో చిక్కుకున్న అమ్మాయి.. బయటపడడానికి చేసే పోరాటాల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందనుంది. ఇందులో జాక్వెలిన్‌పై ప్రత్యేక యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించనున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నార''ని జాక్వెలిన్ సన్నిహిత వర్గాల సమాచారం.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S